క్లుప్తంగా

వేణుగోపాల స్వామికి బంగారు నగలు



కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ గ్రామంలోని శ్రీవేణుగోపాలస్వామికి భక్తులు పాలక విజయభాస్కర్, స్వప్న, రాధిక కృష్ణ, అరుష్ 36 గ్రాముల బంగారంతో ఆభరణాలు చేయించి శనివారం వాటిని ఆలయ కమిటీకి అందజేశారు. ఈ సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి వారిని ఆశీర్వదించారు.

ఘనంగా వాల్మీకి జయంతి



సుభాష్‌నగర్: సీతారాముల జీవితాన్ని ప్రజల హృదయాల్లో సజీవంగా ఉండేలా కళ్లకు కట్టినట్లు రామాయణాన్ని రచించిన మహాకవి వాల్మీకి అని నార్త్ సిటీ హైస్కూల్ ప్రిన్సిపాల్ కోల వెంకటేష్ ముదిరాజ్ అన్నారు. శనివారం వాల్మీకి జయంతిని పురస్కరించుకుని సూరారంలోని నార్త్ సిటీ హైస్కూల్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు నివాళులర్పించారు. సీతారాములు, లక్ష్మణుడు, హనుమంతుడి వేషధారణలో విద్యార్థులు ఆకట్టుకున్నారు.

వృద్ధుడు అదృశ్యం



కమలాకర్‌రావు (ఫైల్)

కుత్బుల్లాపూర్: ఇంటి నుండి బయటికి వెళ్లిన వృద్ధుడు అదృశ్యమైన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పేట్‌బషీరాబాద్ శ్రీను ఎవెన్యూకు చెందిన కమలాకర్‌రావు(72) శనివారం సాయంత్రం బయటికి వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వెతికినా ఆచూకీ కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాలస్తీనాపై దాడులు ఆపాలి



ఇజ్రాయిల్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న సీఐటీయూ నాయకులు

నిజాంపేట్: పాలస్తీనాపై ఇజ్రాయిల్ చేస్తున్న దాడులను తక్షణమే నిలిపివేయాలని కోరుతూ శనివారం సీఐటీయూ బాచుపల్లి కమిటీ ఆధ్వర్యంలో ప్రగతినగర్ ఆటో స్టాండ్ వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీ సభ్యుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ మతాల పేరుతో జరుగుతున్న మారణహోమంలో హమాస్, ఇజ్రాయిల్ సైన్యం మధ్య పాలస్తీనా ప్రజలు చిక్కుకున్నారని, ఇప్పటి వరకు 4,300 మంది మృత్యువాత పడ్డారన్నారు. గాజాపై ఇజ్రాయిల్ దాడులతో కరెంట్, నీటి సరఫరా, ఆహారం లేక ప్రజలు విలవిలలాడుతున్నారని, వెంటనే ఇజ్రాయిల్ మానవతా దృక్పథంతో దాడులు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బాలపీరు, మహేష్ రెడ్డి, ప్రభుదాసు, శ్రీను, నరసింహ, జలీల్ తదితరులు పాల్గొన్నారు.

నల్లగండ్ల మార్కెట్‌లో అగ్ని ప్రమాదం

- సుమారు రూ.18 లక్షల నష్టం

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నల్లగండ్ల కూరగాయల మార్కెట్‌లో శుక్రవారం అర్ధరాత్రి ఆరు షాపులు దగ్ధం అయ్యాయి. సుమారు. 18 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు వ్యాపారులు తెలిపారు. తెల్లవారుజామున 2.30 గంటల ప్రాంతంలో మంటలు అంటుకోవడంతో ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించడంతో వారు మంటలు రేగకుండా చర్యలు చేపట్టారు. ప్రభుత్వ విప్ ఆరికెపూడి గాంధీ అక్కడికి చేరుకొని వారికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అదే విధంగా స్థానిక కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్, శేరిలింగంపల్లి కాంగ్రెస్ అభ్యర్థి వి. జగదీశ్వర్‌గౌడ్, బీజేపీ నాయకులు బుచ్చిరెడ్డిలు అక్కడికి చేరుకొని ప్రమాద వివరాలు తెలుసుకొని అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అలాగే ఈ ప్రాంతాన్ని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌యాదవ్, నాయకులు శనివారం పరిశీలించి ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

కుత్బుల్లాపూర్ బీఆర్‌ఎస్
ఎన్నికల ఇన్‌చార్జ్‌గా శంభీపూర్ రాజు

కుత్బుల్లాపూర్: ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ శంభీపూర్ రాజును కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జిగా నియమిస్తూ పార్టీ రాష్ట్ర నాయకత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే మల్కాజిగిరి అసెంబ్లీకి ఇన్‌చార్జిగా కొనసాగుతున్న ఎమ్మెల్సీ రాజు తాజాగా కుత్బుల్లాపూర్ బాధ్యతలు అప్పగించారు. గత రెండున్నర సంవత్సరాలుగా ఎమ్మెల్యే వివేకానంద్‌తో ఎడమొహం పెడమొహంగా ఉంటూ వస్తున్న రాజును ఈ ప్రాంతంలో నెలకొన్న పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని పార్టీ అధిష్టానం ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించడం విశేషం. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుత్బుల్లాపూర్‌లో ముచ్చటగా మూడోసారి పార్టీ అభ్యర్థిని గెలిపించుకునేందుకు కృషి చేస్తామన్నారు. కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్లతోపాటు కొంపల్లి, దుండిగల్ మున్సిపాలిటీలు, నిజాంపేట్ కార్పొరేషన్ కార్పొరేటర్లు, కౌన్సిలర్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి పార్టీ అభ్యర్థి విజయం కోసం కృషి చేయాలన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాలతో మంత్రి కేటీఆర్ సహకారంతో మేడ్చల్ జిల్లాలో ఐదు నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్ పార్టీ విజయం సాధిస్తుందని ఎమ్మెల్సీ రాజు ధీమా వ్యక్తం చేశారు. తనపై ఉంచిన నమ్మకాన్ని తప్పకుండా నెరవేరుస్తారని, పార్టీలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తూ పార్టీ అభ్యర్థుల విజయం కోసం కృషి చేస్తానన్నారు. మల్కాజ్‌గిరిలో మర్రి రాజశేఖర్ రెడ్డి, కుత్బుల్లాపూర్‌లో వివేకానంద తప్పకుండా గెలుస్తారని, అందుకు అనుగుణంగా పార్టీ కార్యకర్తలు నాయకులు ప్రజాప్రతినిధులు పనిచేయాలని కోరారు.



ముఖ్యమంత్రి కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

ప్రభుత్వ తీరుపై వినూత్న నిరసన

కుత్బుల్లాపూర్: సూరారం కాలనీకి చెందిన ఓ వ్యక్తి అధికారుల తీరును ఎండగడుతూ వినూత్న రీతిలో నిరసన చేపట్టాడు. లౌడ్ స్పీకర్‌లో తన వాయిస్‌ను రికార్డు చేసి శనివారం కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయానికి వచ్చి మైక్ ఆన్ చేసి అధికారుల తీరును ఎండగడుతూ నిరసనకు దిగాడు. సూరారం సర్వే నెంబర్ 107 ఇంటి నెంబర్ 5-43 ఫ్లాట్ నెంబర్ 278 నివాసం ఉండే లక్ష్మి నరసింహ గత 30 ఏళ్లుగా ఇంటి పన్ను కడుతున్నాడు. అయితే 2016లో సూరారం విలేజ్ -1 పేరుతో తనకు పన్నులు చెల్లించాలని నోటీసు అందజేశారు. దీంతో ఆయన అప్పటి నుంచి సమస్యను పరిష్కరించాలని కోరుతూ సర్కిల్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నాడు. అయినా అధికారులు, సిబ్బంది స్పందించకపోవడంతో స్థానిక బిల్ కలెక్టర్, అధికారులకు వ్యతిరేకంగా ఆయన శనివారం లౌడ్ స్పీకర్‌తో సర్కిల్ కార్యాలయం ముందు అటు ఇటు తిరుగుతూ నిరసన తెలిపాడు. ఎన్నికల నేపథ్యంలో అధికారులు బిజీగా ఉండడంతో కార్యాలయ సిబ్బంది అతడిని సముదాయించి పంపించారు.



లౌడ్ స్పీకర్‌తో నిరసన తెలుపుతున్న లక్ష్మీనరసింహ

ఎన్నికలు సాఫీగా సాగేలా..

- పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి
- నిరంతరం అప్రమత్తంగా ఉండాలి
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్



సాక్షి, మేడ్చల్ జిల్లా: ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నిర్వహణకు సంబంధించి ప్రతి పనిని జాగ్రత్తగా, పకడ్బందీగా నిర్వహించాలని ఎలాంటి జాప్యం లేకుండా నివేదికలు సమర్పించడం, చర్యలు తీసుకోవడం సక్రమంగా చేపట్టాలని మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలోని శిక్షణ, ఎన్నికల ప్రవర్తన నియమావళి (మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ - ఎంసీసీ), జిల్లా గ్రీవెన్స్ కమిటీ, పోస్టల్ బ్యాలెట్, లా అండ్ ఆర్డర్, మీడియా మానిటరింగ్ (ఎంసీఎంసీ), స్వీప్ అంశాలపై సంబంధిత అధికారులతో ఆయన ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. జిల్లాలో పారదర్శకంగా ఎన్నికలను నిర్వహించేందుకు అవసరమైన మేరకు నియోజకవర్గంలో అన్ని బృందాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. జిల్లాలోని ఎన్నికల కేంద్రాల్లో ఏమైనా పనులు చేపట్టాల్సిన ఉంటే త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన సూచించారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, జిల్లా నోడల్ అధికారులు పాల్గొన్నారు.

కుత్బుల్లాపూర్ పీహెచ్‌సీకి అవార్డు



అవార్డు అందుకుంటున్న దుండిగల్ వైద్యాధికారిణి వై.నిర్మల..

దుండిగల్: కుత్బుల్లాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఉత్తమ అవార్డు లభించింది. కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కేంద్ర నాణ్యత పర్యవేక్షణ కమిటీ ఈ అవార్డుకు ఎంపిక చేసింది. దుండిగల్‌లోని పీహెచ్‌సీ కేంద్రంలో ఓపిడి, ఐపిడి, లేబరేటరీ, ల్యాబ్ రూమ్, జనరల్ అడ్మినిస్టేషన్, జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు తదితర అంశాల్లో నేషనల్ క్వాలిటీ అష్యూరెన్స్ స్టాండర్డ్స్ పాటించినందుకు ఈ అవార్డు దక్కింది. మేడ్చల్ జిల్లా వైద్యాధికారి టి.రఘునాథ్ స్వామి చేతుల మీదుగా దుండిగల్ మండల వైద్యాధికారిణి వై.నిర్మల అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ పీహెచ్‌సీలో రోగులకు అన్ని వైద్య సేవలు అందిస్తున్నామని, అవార్డు రావడం సంతోషంగా ఉందన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

కుత్బుల్లాపూర్: ఎన్నికల కోడ్ నేపథ్యంలో పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో చెక్‌పోస్టులను ఏర్పాటు చేసిన పోలీసులు ముమ్మరంగా వాహన తనిఖీలు చేపడుతున్నారు. శనివారం రాత్రి సీఐ ప్రశాంత్ ఆధ్వర్యంలో కొంపల్లి- గుండ్ల పోచంపల్లి రోడ్డులో తనిఖీలు చేశారు. అటుగా రాకపోకలు సాగించే పలు కార్లు, ఇతర వాహనాలను ఆపి క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రూ.50వేలకు మించి నగదు ఉంటే వాటిని సంబంధించి పత్రాలు చూపాలని, లేనిపక్షంలో సీజ్ చేస్తామని స్పష్టం చేశారు.



ఐ బొటిక్ ప్రారంభం



గచ్చిబౌలి: ఇప్పటి వరకు మార్కెట్‌లో స్మార్ట్ ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు సందడి చేశాయి, ఇప్పుడు కొత్తగా ఐబొటిక్ లగ్జరీ సన్ గ్లాసెస్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. హైటెక్‌సిటీ ప్రాంతంలో నిర్వాహకులు డాక్టర్ జగదీశ్‌రెడ్డి, ప్రణతిరెడ్డి, డాక్టర్ హేమలత ఆధ్వర్యంలో ఈ బొటిక్‌ను సినీ ప్రముఖులు, మోడల్స్‌తో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ లగ్జరీ బ్రాండ్‌లు అందుబాటులో ఉంటాయన్నారు.

భారీ వాహనం వస్తే అంతే...



దేవేందర్ నగర్‌లో భారీ వాహనం వచ్చినప్పుడు పరిస్థితి ఇదీ..

సుభాష్‌నగర్: గాజులరామారం డివిజన్ దేవేందర్ నగర్ చౌరస్తాలో రోడ్డు ఇరుగ్గా ఉండడంతో తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. మియాపూర్, బాచుపల్లి, గాజులరామారం, షాపూర్‌నగర్ లను కలిపే ఈ రోడ్డు మీదుగా నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. దేవేందర్ నగర్ చౌరస్తా ఇరుగ్గా ఉండడంతో భారీ వాహనాలు ఎదురెదురుగా వచ్చినప్పుడు వెళ్లేందుకు మార్గం లేక గంటల తరబడి వాహనాలు నిలిచిపోతున్నాయి. ఉదయం ,సాయంత్రం వేళల్లో సమస్య తీవ్రంగా ఉంటోందని వాహనదారులు పేర్కొంటున్నారు. రోడ్డుపై ఉన్న దుకాణాలను, షెడ్లను తొలగించి రోడ్డు విస్తరణ చేపట్టాలని వారు కోరుతున్నారు.

మహిళలకు ఉచిత శిక్షణ

మూసాపేట: ప్రశాంత్‌నగర్‌లోని, సోని కాంపెక్స్, రెండో అంతస్తులోని ఎస్ సంజీవరెడ్డి ఫౌండేషన్‌లో నిరుద్యోగ మహిళలకు ఉచిత మగ్గం వర్క్, బ్యూటీషియన్, టైలరింగ్ కోర్సుల్లో ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంస్థ నిర్వాహకులు డా. ఎస్ చంద్రశేఖర్ రెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కోర్సు అనంతరం సర్టిఫికెట్‌లు అందజేస్తామన్నారు. అర్హులకు ముద్ర బ్యాంక్ నుంచి రుణ సౌకర్యం ఉంటుందన్నారు. 18 నుంచి 45 సంవత్సరాల వయస్సు గల మహిళలు ఆధార్ కార్డుతో పై చిరునామాలో సంప్రదించాలని కోరారు. నవంబర్ 1 నుంచి తరగతులు ప్రారంభమవుతాయన్నారు. ఈ నెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

తెగిపడిన కేబుల్ వైర్లతో అవస్థలు

రంగారెడ్డినగర్: రోడ్డుపై తెగిపడిన కేబుల్ వైర్లతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలోని విద్యుత్ స్తంభాలకు పలు నెట్‌వర్క్ సంస్థలకు చెందిన కేబుల్ వైర్లు దర్శనమిస్తున్నాయి. వాటి నిర్వహణ సరిగా లేకపోవడంతో పలు చోట్ల తెగి రోడ్లపై పడుతున్నాయి. ఈ క్రమంలో అటుగా రాకపోకలు సాగించే వాహనదారులు వాటిని గమనించక కింద పడి గాయాల పాలవుతున్నారు. గణేష్‌నగర్ రోడ్డులో ఓ కేబుల్ సంస్థకు చెందిన వైర్లు పడటంతో వాహనదారుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఇష్టానుసారంగా వైర్లను ఏర్పాటు చేసిన నెట్‌వర్క్ సంస్థల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



తాగునీరు కలుషితం



కలుషిత నీటితో నిండిన రిజర్వాయర్ చాంబర్

చింతల్: జలమండలి అధికారుల నిర్లక్ష్యం కారణంగా పలు కాలనీలకు కలుషిత జలాలు సరఫరా అవుతున్నాయి. బాలానగర్‌కు తాగునీటిని సరఫరా చేసే కూకట్‌పల్లి రిజర్వాయర్‌కు వచ్చే భారీ పైప్‌లైన్ చాంబర్లలో వర్షం నీరు చేరడంతో పాటు వాల్వ్ ద్వారా వచ్చే నీటి లీకేజీ గత కొన్ని నెలలుగా అలాగే ఉండిపోయింది. ఈ ఛాంబర్ లో పక్కనే చెట్లు ఉండడంతో ఆకులు రాలి చాంబర్‌లో పడుతున్నాయి. వర్షం పడ్డ ప్రతిసారి రిజర్వాయర్ చుట్టూ వచ్చే నీటితో చాంబర్ నిండిపోతుంది. ఛాంబర్‌లో ఉన్న భారీ వాల్వ్‌కు లీకేజీ కారణంగా ఈ నీరు పైప్ లైన్‌లోకి వెళ్లి నీరు కలుషితమవుతోంది. సమస్యపై పలుమార్లు ఫిర్యాదు చేసినా జలమండలి అధికారులు పట్టించుకోకపోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. కూకట్‌పల్లి జలమండలి అధికారులు స్పందించి చాంబర్లకు మరమ్మతులు చేపట్టి నీటి లీకేజీలను అరికట్టి స్వచ్ఛమైన తాగునీటిని అందించాలని కోరుతున్నారు.

నిరుద్యోగ యువతకు ఉపాధి శిక్షణ

ఆల్విన్‌కాలనీ: నియోకర్సర్, టెక్ మహీంద్రా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ, యువకులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇన్సూరెన్స్ బ్యాంకింగ్, ఫైనాన్షియల్ ఇండస్ట్రీపై అవగాహన, సాఫ్ట్ స్కిల్, బేసిక్ ఐటీ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లీష్ కోర్సుల్లో ఉచిత సర్టిఫికేషన్ కోర్సును అందజేస్తున్నామని, గత రెండేళ్లుగా సుమారు 2500 మందికి ఉచిత శిక్షణ ఇచ్చి 500 మందికి వివిధ కంపెనీల్లో ఉపాధి అవకాశాలు కల్పించామన్నారు. వివరాలకు 7799594242, 7799694242 నెంబర్‌లలో సంప్రదించాలని కోరారు.

అభివృద్ధి పథకాలే గెలిపిస్తాయి

కుత్బుల్లాపూర్: తొమ్మిదేళ్లుగా చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే ఎమ్మెల్యే వివేకానంద్‌కు హ్యాట్రిక్ విజయాన్ని అందిస్తాయని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు అన్నారు. శనివారం పేట్‌బషీరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆయన ఎమ్మెల్యే వివేకానంద్‌తో కలిసి గాజులరామారం, జగద్గిరిగుట్ట, సూరారం, చింతల్ డివిజన్ల కార్పొరేటర్లు, ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ పేద ప్రజల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని, దళిత బంధు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, జీవో 59, 59, కల్యాణలక్ష్మి తదితర పథకాలతో లక్షలాది మందికి లబ్ధి చేకూరిందన్నారు. ప్రజలు పథకాలు, అభివృద్ధిపై ప్రజల్లో విస్తృత ప్రచారం చేసి బీఆర్‌ఎస్ విజయానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆయా డివిజన్ల అధ్యక్షులు, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

జంగ్ తెలంగాణ 2023



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే వివేకానంద్..

బీఆర్‌ఎస్ ప్రభుత్వం హ్యాట్రిక్ ఖాయం

కుత్బుల్లాపూర్: ప్రజా శ్రేయస్సే పరమావధిగా పని చేస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం హ్యాట్రిక్ సాధించడం ఖాయమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు అన్నారు. శనివారం కుత్బుల్లాపూర్ నియోజవర్గ పరిధిలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు వివిధ సమస్యలపై ఎమ్మెల్సీని కలిసి వినతి పత్రాలు అందజేశారు. దీనిపై స్పందించిన ఆయన సంబంధిత అధికారులతో ఫోన్లలో మాట్లాడి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

- భౌరంపేట్ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి తన జన్మదినాన్ని పురస్కరించుకుని శనివారం ప్రభుత్వ విప్ శంభీపూర్‌రాజును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఆయనను శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. మేడ్చల్ జిల్లా గ్రంథాలయ శాఖ మాజీ చైర్మన్ నాగరాజు యాదవ్, నాయకులు వెంకట్రామిరెడ్డి, ప్రదీప్‌రెడ్డి, ప్రభు తదితరులు ఉన్నారు.



కౌన్సిలర్ శ్రీనివాస్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న శంభీపూర్‌రాజు

బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయి



హన్మంతరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు

కుత్బుల్లాపూర్: కుటుంబ పాలన కొనసాగిస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని ఇంటికి పంపే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. శనివారం కుత్బుల్లాపూర్ డివిజన్ చెరుకుపల్లి కాలనీకి చెందిన బీఆర్‌ఎస్ మహిళా నాయకురాలు సుజాత, నిజాంపేట్ కార్పొరేషన్ రాజీవ్‌గాంధీనగర్‌కు చెందిన బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు సాయికిరణ్, సాయికుమార్ తమ అనుచరులతో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కండువాలు కప్పిన హన్మంతరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతోనే ముఖ్యమంత్రి కేసీఆర్ కాంగ్రెస్ పార్టీపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని, కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలు బీఆర్‌ఎస్ పార్టీకి గుబులు పుట్టిస్తోందన్నారు. తొమ్మిదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో ఆ పార్టీ నాయకులే బాగు పడ్డారని, సామాన్య ప్రజలకు మేలు జరగాలంటే కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. కేంద్ర, రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడం తథ్యమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలపై అవగాహన

కుత్బుల్లాపూర్: ఎన్నికల్లో వ్యవహరించాల్సిన నిబంధనలపై కేంద్ర ఎన్నికల కమిషన్ ప్రతినిధులు సిబ్బందికి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అవగాహన కల్పించారు. కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయంలో శనివారం ఎన్నికల అధికారి పులి సైదులు అధ్యక్షతన ఏఆర్వోలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి నామినేషన్ల ప్రక్రియలో తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. నామినేషన్ల ప్రక్రియ, స్క్రూటిని, అఫిడవిట్, దరఖాస్తుల వివరాలను ఏ విధంగా తనిఖీ చేయాలి అన్న అంశాలపై చర్చించారు. నామినేషన్ల ప్రక్రియ రోజు తీసుకోవలసిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. అనంతరం లయోలా జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను సందర్శించారు. నవంబర్ 4 ,5 తేదీల్లో రెండు రోజులపాటు ప్రొసీడింగ్ ఆఫీసర్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల విధుల్లో ఎవరైనా అశ్రద్ధ వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పారదర్శకంగా ఎన్నికల ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ ఎన్నికల అధికారి పులి సైదులు, ఎలక్ట్రోరల్ రిటర్నింగ్ అధికారి నాగమణి, ఏఆర్‌ఓలు మల్లారెడ్డి, అబ్దుల్ రహమాన్, సుచరిత, శ్రీహరి, పూల్ సింగ్, రామకృష్ణ, ఉదయ్ కుమార్, శ్రీనివాస్ రావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రిట్నరింగ్ అధికారి పులి సైదులు

నేడు బీఆర్‌ఎస్ బూత్ సమావేశాలు

నిజాంపేట్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఆదివారం నిజాంపేట్ కార్పొరేషన్ బీఆర్‌ఎస్‌పార్టీ బూత్‌స్థాయి సమావేశాలు నిర్వహించనున్నారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశాలకు ఎమ్మెల్యే వివేకానంద్, మేయర్ నీలారెడ్డి, డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్, బీఆర్‌ఎస్ ఫ్లోర్ లీడర్ ఆగం పాండుముదిరాజ్, బీఆర్‌ఎస్ ప్రెసిడెంట్ రంగరాయప్రసాద్ హాజరు కానున్నారు. ఉదయం 8 గంటలకు 20వ డివిజన్ పూజిత ఎన్క్లేవ్‌లో, 8.30కు 17వ డివిజన్ మా విల్లాస్‌లోని చిల్డ్రన్స్ పార్క్ వద్ద, ఉదయం 9 గంటలకు 18వ డివిజన్ సాయిఅనురాగ్ కాలనీలో, 10 గంటలకు 1వ డివిజన్ ప్లేసెంట్ విల్లా క్లబ్ హౌస్‌లో, 11 గంటలకు 2వ డివిజన్ పరిధి గణపతి ఆలయం వద్ద, 11.30 గంటలకు 22వ డివిజన్ సాయిభాస్కర్ హబ్, ఛత్రపతి శివాజీ పార్క్ వద్ద సమావేశాలు జరుగుతాయని, బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, డివిజన్ల అధ్యక్ష, కార్యదర్శులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని మేయర్ కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది.



ట్రాఫిక్ పోలీసుల శ్రమదానం

కుత్బుల్లాపూర్: సుచిత్ర చౌరస్తాలోని జాతీయ రహదారిపై శనివారం కంకర రోడ్డు మీద పడడంతో వాహనదారులు అదుపుతప్పి కింద పడుతున్నారు. దీనిని గుర్తించిన అల్వాల్ ట్రాఫిక్ పోలీసులు బాల్ దాస్, పాండురంగం కొద్దిసేపు ట్రాఫిక్‌ను చక్కదిద్దే పనులను పక్కనపెట్టి పలుగు, పారా అందుకున్నారు. రోడ్డుపై పడి ఉన్న కంకరను ఒకచోట చేర్చి గంపతో ఎత్తి పక్కన పడేశారు. ఇదంతా చూస్తున్న స్థానికులు కూడా తలా ఒక చెయ్యి వేశారు.. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్న ట్రాఫిక్ పోలీసులను పలువురు అభినందించారు.